
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 18.8
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
శుక్రవారం 22 నవంబరు 2024





యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

ఆలయానికి చేరిన బంగారు తాపడం రేకులు

7


'గుట్ట' పాలకమండలి దిశగా అడుగులు

- సీఎం ఆదేశాలతో చురుకుగా అధ్యయనం
- 12 మంది సభ్యులతో పాలకమండలి నియామకానికి యోచన
- కమిటీలో దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో

తిరుమల తిరుపతి తరహాలో గుట్టలో పాలకమండలి ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఈ మేరకు సీఎం ఆదేశాలు జారీ చేయగా, అధికారులు అధ్యయనం ప్రారంభించారు. మొత్తం 12 మంది సభ్యులతో పాలకమండలిని నియమించే అవకాశం ఉంది. ఈ కమిటీలో దేవాదాయశాఖ కమిషనర్‌తోపాటు, ఆలయ ఈవో సభ్యులుగా ఉండనున్నారు.

7

● ఆంధ్రజ్యోతి, భువనగిరి అర్బన్



బదిలీపై వెళ్లిన అధికారులు

ఒక్కొక్కరుగా..

తిరిగి పాతస్థానానికి చేరుకుంటున్న వైనం

యాదగిరిగుట్ట ఆలయం నుంచి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన అధికారులు ఒక్కొక్కరుగా తిరిగి పాత స్థానాలకు చేరుతున్నారు. సుమారు 12 ఏళ్ల తర్వాత దేవాదాయశాఖ ఆలయ అధికారులు, సిబ్బంది బదిలీలు నిర్వహించగా, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన అధికారుల పలు కారణాలతో తిరిగి యథాస్థానానికి వస్తుండటం చర్చనీయాంశమైంది. 7



నిత్యం సైబర్ ఉచ్చు

> సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతుల్లో డబ్బు లాగేందుకు మోసాలకు పాల్పడుతున్నారు. చౌటుప్పల్ పట్టణానికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్‌కు ఈ ఏడాది జూన్ 21న సీబీఐ ఆఫీసర్ పేరుతో ఒక వాట్సప్ కాల్ వచ్చింది. మీ కుమార్తె మా కంట్రోల్‌లో ఉంది.. రూ.50 వేలు ఇస్తేనే విడిచి పెడతామంటూ చెప్పి కాల్ కట్ చేశారు. శ్రీనివాస్ కూతురు ఢిల్లీలో విద్యాభ్యాసం చేస్తోంది. మళ్లీ రెండో రోజు కూడా అదే నంబరుతో పోలీస్ డీఎస్పీ అని చెప్పి వాట్సప్ కాల్ వచ్చింది. ఈ విధంగా మొత్తం మూడు సార్లు కాల్ వచ్చింది. వాట్సప్ డీపీలో ఐపీఎస్ ఆఫీసర్ ఫొటో ఉంది. నేరగాళ్లు కాల్ చేసినప్పుడు ఓ అమ్మాయి ఏడ్చినట్టు శబ్దాన్ని వినిపించారు. శ్రీనివాస్ వెంటనే ఢిల్లీలోని తన కుమార్తెకు ఫోన్‌చేసి మాట్లాడగా, తనను ఎవ్వరూ కిడ్నాప్ చేయలేదని, భయపడొద్దని చెప్పడంతో ఆయన ఊపిరి పీల్చుకున్నారు. ఆమె ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి ఢిల్లీకి విమానం ఎక్కేందుకు ఒక గంట ముందుగా శ్రీనివాస్‌కు ఇలాంటి బెదిరింపు కాల్స్ వచ్చాయి. సైబర్ నేరగాళ్లే తన నుంచి డబ్బు లాగేందుకు పన్నాగం పన్నారని నిర్ధారణకు వచ్చిన శ్రీనివాస్ ఈ ఏడాది 21న చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఇప్పటి వరకు పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించకపోగా వారు విచారణ నిర్వహిస్తున్నారు.
>
> - ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్ టౌన్

- జాగ్రత్తలతోనే తప్పనున్న ముప్పు
- బ్యాంక్ ఖాతా, ఏటీఎం, పాస్‌వర్డ్ చెబితే జేబు ఖాళీ
- ఇప్పటికే పలువురు బాధితులు
- రూ.5.90కోట్లు కొల్లగొట్టిన మోసగాళ్లు
- ఒక్క సూర్యాపేట జిల్లాలో ఏడాదిలో 1,050 కేసులు నమోదు

సూర్యాపేటక్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి డబ్బు దోచుకునేందుకు నేరగాళ్లు వివిధ రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో దొంగలు ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లేవారు. మరికొందరు నగదును తీసుకెళ్లే సమయంలో ఏమార్చి అపహరించుకుపోయేవారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడంతో దీనిపై పట్టుసాధించిన కొంత మంది సైబర్ నేరగాళ్లుగా అవతారమెత్తారు. ఎక్కడో ఉండి ఫోన్లు చేసి, మెసేజ్‌లు పంపి ప్రజల వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలను మాయమాటలతో తెలుసుకొని నగదును కాజేస్తున్నారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బుపోయాక గానీ మోసపోయామని బాధితులు గుర్తిస్తున్నారు. ఇలాంటి సైబర్ నేరాలు ప్రస్తుతం అధికమయ్యాయి. వీరి పై అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నా ఎక్కడోచోట ప్రజలు ఈ నేరగాళ్లబారిన పడుతూనే ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త

కళ్లెదుట కనిపించి నేరం చేసే వ్యక్తుల కంటే సైబర్ నేరగాళ్లు చేసే మోసాలు ఎక్కువగా ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉన్న వ్యక్తులు తప్పుడు చిరునామాలతో పలు రకాల సిమ్ కార్డులు కొనుగోలు చేయడంతో పాటు కొత్త కొత్త మెయిల్ అడ్రస్‌లు రూపొందించి నేరాలకు పాల్పడుతున్నారు. వీరు అమాయక ప్రజల గుర్తింపు కార్డులను వినియోగిస్తున్నారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు దోచుకుంటున్నారు. ఇలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

వివరాలు చెబితే డబ్బు మాయం

గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి వివిధ రకాలుగా నమ్మబలికి మోసగిస్తున్నారు. బ్యాంక్ అధికారులమని, లాటరీలో బహుమతి వచ్చిందని, కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని, లేదంటే తక్కువ వడ్డీకి లోన్లు ఇప్పిస్తామని, పలు ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెబుతున్నారు. ఈ క్రమంలో బ్యాంకు ఖాతా వివరాలు

- మిగతా 8వ పేజీలో



వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పవద్దు



ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దు. వాటి ద్వారా కొంత మంది సైబర్ నేరగాళ్లు మోసగించి డబ్బు దండుకుంటున్నారు. ఈ విధంగా ఎవరైనా మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలి. 24 గంటల్లోపు సంబంధిత పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వాలి. ఆ విధంగా సమాచారం ఇచ్చిన వారి బ్యాంకు ఖాతాను నిలుపుదల చేయించి ఖాతా నుంచి డబ్బులు పోకుండా చూడడంతో పాటు, పోయిన డబ్బును తిరిగి రాబట్టే అవకాశం ఉంది. ఇప్పటికే సైబర్ సెక్యూరిటీ సెల్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అంతేగాక సైబర్ నేరాలపై జిల్లాలో సైబర్‌ల్యాబ్ కూడా ఏర్పాటు చేశాం.

- సన్‌ప్రీత్‌సింగ్, సూర్యాపేట జిల్లా ఎస్పీ

సర్వే పారదర్శకంగా ఉండాలి

- ఆపరేటర్లు తప్పులు లేకుండా చూడాలి
- కలెక్టర్ హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి(కలెక్టరేట్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా ఉండాలని, డాటా నమోదు ప్రక్రియలో ఆపరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో భువనగిరి డివిజన్‌లోని 12మండలాలకు చెందిన 800మంది, చౌటుప్పల్ డివిజన్ ఐదు మండలాలకు చెందిన 500మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమగ్ర కుటుంబ సర్వే వివరాలు అత్యంత గోప్యంగా ఉంచి దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. సర్వే సమాచారాన్ని ఆపరేటర్లు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. సర్వేలో జిల్లా ఐదో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి కొంగర సామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తిచేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వెంటనే పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నత్తనడకన సాగడంపై డీఈ, ఏఈలపై ఆగ్రహం వ్యక్తం చేసి రాజాపేట ఏఈ శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీలోగా వంద శాతం ఎండీ రికార్డులు అందజేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

(ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యమైన వంట దినుసులను వాడాలని, వంట పాత్రలను శుభ్రంగా ఉంచాలన్నారు.

అపరిశుభ్రతకు అవకాశం ఇవ్వకుండా విధిగా మెనూ పాటించాలన్నారు. భోజనాన్ని ప్రధానోపాధ్యాయులు రుచి చూశాకే విద్యార్థులకు వడ్డించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లోనే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. డీఈవో కే.సత్యనారాయణ సింగారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల పక్కనే కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

డీఏవో గోపాల్



వ్యవసాయ అధికారులు, డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో గోపాల్

భువనగిరి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. గురువారం భువనగిరిలో వ్యవసాయ అధికారులు, ఎరువులు, విత్తనాల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించాలని, ధరల పట్టికను దుకాణం ఎదుట ప్రదర్శించాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. రైతులు డీఏపీకి ప్రత్యామ్నాయంగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ కాంప్లెక్స్ ఎరువులను వినియోగించాలని, నానో యూరియాను, నానో డీఏపీని కూడా రైతులు వినియోగించి రసాయన ఎరువుల ఖర్చులు తగ్గించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏడీఏ వెంకటేశ్వర్లు, పద్మావతి, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



క్యాంటీన్ ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి(కలెక్టరేట్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించి ఆర్థిక పురోగతికి ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ హనుమంతరావుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులను చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, అందులో భాగంగానే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను మహిళా సంఘాలకు అప్పగించారన్నారు. జిల్లాలో ఐదు మహిళా శక్తి క్యాంటీన్లను ఒక్కోటి సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు చేయూతనిచ్చే విధంగా పావలా వడ్డీకి రుణాలు మంజూరు చేస్తామని, అదే విధంగా జిల్లాకు స్త్రీశక్తి మహిళా భవన్‌ను ప్రభుత్వం కేటాయించిందన్నారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ, మహిళలకు ప్రభుత్వం పలు అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ద్వారా శిక్షణ పొందిన మహిళలు క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో పల్లె అందాలను తలపిస్తూ ఈ క్యాంటీన్లు ఉంటాయన్నారు. బ్యాంకు రుణాలతో మహిళలు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ శ్యాంసుందర్, మహిళా శక్తి సంఘం అధ్యక్షురాలు రేణుక, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలి

మోడల్ స్కూల్స్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

తుర్కపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేలా ఉపాధ్యాయులు తోడ్పాటునందించాలని మోడల్ స్కూల్స్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామపురం గ్రామంలోని మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ఇంటర్, పది విద్యార్థులకు పకడ్బందీగా స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని, వంట సామగ్రి, ల్యాబ్, మరుగుదొడ్లను పరిశీలించారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ఆయన వెంట ఏఎంవోలు మంజరి, రవికుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, ఉపాధ్యాయులు మహేశ్, సతీష్, చంద్రారెడ్డి, సునీత, వినోదరాణి, మధు, కార్తిక్ ఉన్నారు.



6

ప్రాణవాయువులా పనిచేయాలి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- ఏఆర్ పీసీల పాసింగ్ అవుట్ పరేడ్

పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలి

ఎమ్మెల్యే కుంభంను కలిసిన బస్వాపూర్ నిర్వాసితులు

భువనగిరి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న తమకు పూర్తిస్థాయి పరిహారం ఇప్పించాలని బీఎన్.తిమ్మాపురం నిర్వాసితులు కోరారు. గురువారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని నిర్వాసితులు కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిర్వాసితులందరికీ పూర్తిస్థాయి పరిహారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. పునరావాసం కింద భువనగిరి శివారులోని హుస్సేనాబాద 107 సర్వే నెంబర్‌లో కేటాయించిన ప్రాంతంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నిర్వాసితుల కోసం ప్రభుత్వం రూ.50కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి, నిర్వాసితుల ప్రతినిధులు పిన్నం రాజు, జిన్న మల్లేశ్, దర్శన్‌రెడ్డి, రావుల నందు, వల్దాసు గండయ్య, తదితరులు పాల్గొన్నారు.



ముంపు నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం, ఆర్డీవో కృష్ణారెడ్డి

సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి



చిట్యాల సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

చిట్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ జిల్లా చిట్యాలలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. డిసెంబరు 2 నుంచి 4వరకు మిర్యాలగూడలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అరూరి శ్రీను, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, కత్తుల లింగస్వామి, బొబ్బల సుధాకర్ రెడ్డి, ఐతరాజు నర్సింహ, కల్లూరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని సీపీ ఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, కల్లూరి యాదగిరి, చెర్కు పెద్దులు, కల్లూరి కంఠమహేశ్వర్, నన్నే సాహెబ్, కుమ్మరి శంకర్, దండు రవి, ఆమనగంటి ఐలయ్య, కట్ట రామచంద్రం, సోమనబోయిన సైదులు, ముప్పిడి సత్యం, బొల్లెద్దు సైదులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం నిలిపిన 108 సిబ్బంది

భువనగిరి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీపీఆర్ చేసి 108 వాహన సిబ్బంది ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడారు. సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో గురువారం ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటకు చెందిన సిద్దులు కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబసభ్యులు అప్రమత్తమై వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు తుర్కపల్లికి చెందిన వాహనం గ్రామానికి చేరుకోగానే ఎలాంటి హృదయ స్పందన లేకుండా స్పృహ తప్పి పడిన సిద్ధులును గమనించిన 108ఈఎంటీ అంబేడ్కర్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. విలువైన ప్రాణాలు కాపాడి ఆసుపత్రికి తరలించిన 108పైలెట్ రాకేష్, ఈఎంటీ అంబేడ్కర్, సిబ్బందిని జిల్లాఆసుపత్రి డీఎంవో విష్ణు, కుటుంబసభ్యుల సమయస్ఫూర్తికి అభినందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఆందోళ్ మైసమ్మ హుండీ కానుకల లెక్కింపు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఉన్న దండుమల్కాపురం ఆందోళ్ మైసమ్మ దేవాలయ హుండీ కానుకలను గురువారం లెక్కించారు. 50రోజులకు రూ.14,96,475 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు ఏడుకొండలు, ఈవో మోహన్‌బాబు, సిబ్బంది సత్తిరెడ్డి, అర్చకులు శివప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

ప్రాణవాయువులా పనిచేయాలి





పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, పక్కన సూర్యాపేట, నల్లగొండ జిల్లాల ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, శరత్‌చంద్ర పవార్, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- డీటీసీలో ముగిసిన ఏఆర్ పీసీల పాసింగ్ అవుట్ పరేడ్
- ఆకట్టుకున్న ఏఆర్ పీసీల కవాతు

నల్లగొండ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించడం అంటే ప్రజలకు సేవ చేయడమేనని, ప్రజలకు సమర్థమైన సేవలందిస్తూ ప్రాణవాయువులా పనిచేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు.ఈ శాఖలో ఉద్యోగం అదృష్టంగా భావించి అంకిత భావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ కేంద్రంలో తొమ్మిది నెలలుగా శిక్షణ పొందిన సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, నారాయణపేట, నిర్మల్ జిల్లాలకు చెందిన 265 మంది ఏఆర్ ట్రైనింగ్ కానిస్టేబుళ్లకు నిర్వహించిన బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఆయనకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఎస్పీలు శరత్ చంద్ర పవార్, సన్ ప్రీత్‌సింగ్‌లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన పరేడ్‌లో ఆయన మాట్లాడుతూ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్‌శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని తెలిపారు. పోలీస్ శాఖ ఎన్నో సవాళ్లతో కూడుకున్న ఉద్యోగమని, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగలమన్నారు. శిక్షణ అనంతరం కూడా ప్రతి రోజూ వ్యాయామం చేసి ధృడంగా ఉండాలన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఎంతో కష్టపడి చదివించిన తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, ఇప్పుడు పొందిన శిక్షణ సర్వీస్ పూర్తయ్యేంత వరకూ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏఆర్ కానిస్టేబుళ్లు ప్రదర్శించిన పరేడ్ ఆకట్టుకుంది.కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ రమేష్, అడ్మిన్ ఏఎస్పీ రాములునాయక్, డీటీసీ డీఎస్పీ విఠల్‌రెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు డానియల్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి, దూది రాజు, ఆర్ఐలు హరిబాబు, శ్రీను, సంతోష్, ఎస్ఐలు బాబు, ప్రవీణ్, శ్రీనివాస్, భరత్, ఆర్ఎస్ఐలు అఖిల్ చంద్ర, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు జయరాజు, సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మా నాన్నల కల నెరవేర్చా



మాది నిరుపేద కుటుంబం. మా సొంత ఊరు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామం. అమ్మా కనకమ్మ నాన్న సాయిలు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ నన్ను డిప్లొమా ఇంజనీరింగ్ వరకూ చదివించారు. మానాన్న కోరిక నేను ఆర్మీలో చేయాలి, కానీ నేను మా అమ్మా నాన్నకు ఒక్క కొడుకునే కావడంతో అటుగా పంపలేదు. యూనిఫాం సర్వీస్ చేయాలనే వారి కోరిక మేరకు కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగం సాధించా. వారి కళ్ల ముందే ఉండి వారిని మంచిగా చూసుకోవాలనే ఆలోచనతో పోలీస్ ఉద్యోగం సాధించా. నల్లగొండ డీటీసీలో ప్రిన్సిపాల్ సహకారంతో శిక్షణ పూర్తి చేశా. ఇక్కడ శిక్షణ ఎంతో బాగుంది.

ఒగ్గు కృష్ణ

ఆర్మీలో పనిచేశా.. పోలీస్ కానిస్టేబుల్‌గా సేవలందిస్తా



మాది వికారాబాద్ జిల్లా తాండూరు గ్రామం. మాది పేద కుటుంబం అయినా మా అమ్మ నాన్న నన్ను డిగ్రీ వరకూ చదివించారు. 17 ఏళ్లుగా ఆర్మీలో సేవలందించి రిటైర్ అయ్యా. మా నాన్న శివన్న చనిపోయినా మా అమ్మ ఎంతో ప్రోత్సహించేది. 13 ఏళ్ల క్రితం అనురాధతో నాకు వివాహం కాగా బాబు, పాప ఉన్నారు. ఆర్మీలో సేవలందించి రిటైర్ అయ్యాక ఎస్ఐ కావాలనుకున్నా. కానీ ఎస్ఐ ఉద్యోగం ఒక్క మార్కుతో రాలేదు. కాగా ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. ఆర్మీలో మాదిరిగానే సేవలను కానిస్టేబుల్‌గా ప్రజలకు సేవలందిస్తా.

నాటికర్ సుభాష్




సోదరుడి టోపీతో చెల్లెలు సెల్ఫీ

ఆనందంగా గడుపుతూ..

శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ పీసీలు తమ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకుని కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకున్నారు. సోదరుడి క్యాప్‌లను ధరించి చెల్లెళ్లు సంతోషంలో మునిగిపోయారు. శిక్షణ కోసం తొమ్మిది నెలలుగా ఇంటికి దూరంగా ఉండటంతో ఇంటి నుంచి భోజనాన్ని తీసుకువచ్చి కుటుంబ సమేతంగా కలిసి భోజనం చేసి జ్ఞాపకాలను పంచుకున్నారు. 265 మంది ఏఆర్ పీసీల శిక్షణ ముగింపు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, బంధువులతో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో సందడి నెలకొంది.



కుమార్తెకు గోరుముద్దలు తినిపిస్తున్న తండ్రి



పోలీస్ విన్యాసంతో ట్రైనర్‌కు అభివాదం చేస్తున్న శిక్షణ పూర్తి చేసిన కానిస్టేబుళ్లు



కుమారుడికి ఆహారం తినిపిస్తున్న తల్లిదండ్రులు

సంబురంగా దివ్యాంగుల దినోత్సవం

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని అవుట్‌డోర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఆ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. క్రీడాకారుడితో కలిసి చెస్ ఆడారు. ర్యాలీని ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ పోటీల మధ్య సంబురంగా దినోత్సవాన్ని దివ్యాంగులు జరుపుకున్నారు.



దివ్యాంగుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు





దివ్యాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి, క్రీడాకారుడితో కలిసి చెస్ ఆడుతున్న కలెక్టర్

జిల్లా వ్యాప్తంగా చెకుముకి పోటీలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లావ్యాప్తంగా చెకుముకి టాలెంట్ పోస్టులను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. హాలియాలో నల్లగొండ జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో అనుముల మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పేపరును సీఐ జనార్థన్‌గౌడ్, ఎంఈవో గుండా కృష్ణమూర్తిలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా బాధ్యులు కత్తి కోటిరెడ్డి, లింగాల సైదులు పాల్గొన్నారు.

● దామరచర్లలో ఎంఈవో బాలాజీనాయక్, ఎస్ఐ హరికృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కేతావత్ సైదానాయక్ పాల్గొన్నారు.

● చిట్యాలలో ఎంఈవో పోనుగోతు సైదానాయక్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ మండల కన్వీనర్ దాసరి శ్రీరాములు, కుకుడాల గోవర్థన్ పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మేక నాగయ్య, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్, రివైవ్ ఆసుపత్రి డాక్టర్ చేతరాజు రవికిరణ్ పాల్గొన్నారు.

●కట్టంగూరులో ఎంఈవో అంజయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు ఆంజనేయులు ఉన్నారు.

కార్తీకమాస పూజల సందడి



బాడవతండాలో మహాపడిపూజ కోసం ఏర్పాటు చేసిన భారీవేదిక

మఠంపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం బాడవతండాలో స్థానిక స్వాముల ఆధ్వర్యంలో మహాపడిపూజ మహోత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు రవి, సైదా, తిరపతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకకు మండలవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప, హనుమాన్, శివస్వాములు పాల్గొన్నారు. పడిపూజ, మహాయజ్ఞం, మెట్లపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో కన్నులపండువగా నిర్వహించారు.

● చింతపల్లి: అయ్యప్పదీక్షతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వింజమూర్‌లోని హరిహర క్షేత్రంలో అయ్యప్పస్వాములు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్,ప్రధానకార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్, వెన్నం శేఖర్, కుందేళ్ల శ్రీశైలం పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అయ్యప్ప ఆలయాన్ని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి గురువారం సందర్శించారు. అయ్యప్పస్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 27న సాగర్ నియోజకవర్గ కేంద్రమైన హాలియాలో నిర్వహించనున్న మహాపడిపూజలో పాల్గొనాలని భక్తులను కోరారు. ఆయన వెంట నవీన్, వరుణ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడరూరల్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరులోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రుద్రాభిషేకం, అయ్యప్ప మహా పడిపూజ, అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కన్నెగుండ్ల కరుణాకర్, ఉమామహేశ్వరి తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.

● చౌటుప్పల్ టౌన్: అయ్యప్పస్వామిని నిష్ఠతో పూజించే భక్తులకు అంతా మేలే జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ పట్టణ ఇన్‌చార్జి మొగుదాల రమేష్‌గౌడ్ అన్నారు. స్థానిక బాలాజీ దేవాలయంలో అయ్యప్ప భక్తులకు రమేష్ గౌడ్- సాహితీ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బత్తుల విప్లవ్‌కుమార్, గురుస్వామి టీఎస్ గౌడ్, చెవగోని మహేష్, సప్పిడి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



నేరడలో లక్ష తులసీదళాలతో అర్చన

● చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి కోదండరాముడికి సామూహికంగా 'లక్ష తులసీదళార్చన'ను నిర్వహించారు. కోదండరాముని జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు.

అంగడిపేట ఎక్స్‌రోడ్డు @ అయ్యప్పపేట

ఆ గ్రామంలో ఏ దేవాలయమూ లేదు. అయినా ఆధ్యాత్మిక వాతావరణం పుష్కలం. 25 ఏళ్ల కిందట ముగ్గురితో మొదలైన అయ్యప్పస్వామి మాలధారణ దీక్ష నేడు 60 మందికి చేరాయి. గ్రామంలోని ఖాళీ ప్రాంతాన్ని తమ సన్నిధానంగా మార్చుకుని నిష్ఠతో ప్రతి రోజూ పూజలు, భజనలు, భిక్ష(భోజనాల)ను చేపడుతుంటారు. అదేవిధంగా ఏటా శబరిమలై యాత్రకు అందరూ కలిసి వెళ్తుండటం మరో విశేషం. గత 15 ఏళ్లుగా ఏటా ఘనంగా మహాపడి పూజ నిర్వహిస్తుండగా, శబరిమలైలో పూజలు చేసే తాంత్రిక పూజారి బ్రహ్మశ్రీ సత్యనారాయణ గురుస్వామి ఇక్కడ మహాపడి నిర్వహిస్తుండడం ప్రత్యేకత. ఆ అత్యుద్భుత సన్నిధానం కోసం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై ఉన్న అంగడిపేటకు ఎక్స్‌రోడ్డు వద్దకు వెళ్లాల్సిందే.

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)



సన్నిధానంలో పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

- ఆలయం లేని చోట ఆధ్యాత్మిక నిలయం
- పాతికేళ్లుగా అయ్యప్ప సన్నిధానం ఏర్పాటు
- సన్నిధానంలో నేడు మహాపడిపూజ

పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారికి కిలోమీటర్ దూరంలోని అంగడిపేట గ్రామంలో పలు ఆలయాలు ఉన్నప్పటికీ అంగడిపేట ఎక్స్‌రోడ్డు అన్నిరంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందింది. అయినప్పటికీ ఇక్కడ ఒక్క ఆలయమూ లేదు. అయినా ఇక్కడ ప్రతి ఏటా కార్తీకమాసంలో ప్రారంభమయ్యే అయ్యప్పదీక్షలు ఊరంతటికీ ఆధ్యాత్మిక వాతావరణాన్ని పంచుతాయి. గడిచిన 10 ఏళ్లుగా రైతు భవనమే అయ్యప్పలకు సన్నిధానమై ప్రత్యేక ఆలయంగా మారింది. గత ప్రభుత్వం రైతు భవనాన్ని రైతు వేదికగా మార్చడంతో ఈసారి మూతపడిన పాఠశాలను సన్నిధానంగా చేసుకుని ప్రతిఒక్కరూ ఇక్కడే పూజాధికాలను చేస్తున్నారు. ప్రతిరోజూ ఇక్కడ భజనలు చేపడుతుంటారు. మధ్యాహ్నం భిక్ష కూడా ఇక్కడే స్వాములంతా సన్నిధానంలోనే ఆరగిస్తారు. ఎవరైనా స్వాములు ప్రత్యేకంగా భిక్ష పూజ ఏర్పాటుచేసిన రోజు అందరూ కలిసికట్టుగా హాజరవుతారు. కేరళ అయ్యప్ప దేవాలయంలో నిర్వహించే విధంగా సాక్షాత్తు శబరిమలై పూజలు చేసే తాంత్రిక పూజారే బ్రహ్మశ్రీ సత్యనారాయణ గురుస్వామిచే ఈ నెల 22న అత్యద్భుతంగా మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు స్వాములు తెలిపారు.

సన్నిధానమే లోకం



అయ్యప్పమాల ధరించిన రోజు నుంచి సన్నిధానమే లోకంగా ఉంటా. ఈసారి 60మంది సన్నిధానంలో మాల వేసుకున్నారు. 20మంది కన్నెస్వాములు ఉండడం ఆనందంగా ఉంది. అందరం కలిసికట్టుగా నిష్ఠతో పూజలు నిర్వహిస్తాం. దీక్షలో ఉన్నన్ని రోజులు శరణుఘోషతో పాటు సన్నిధానమే లోకంగా ఉంటాం. ఈ నెల 22న మహాపడిపూజ అద్భుతంగా నిర్వహిస్తాం.

బైరు యాదగిరి, 19వ పడి

ఎక్కడికెళ్లినా సన్నిధానం చేరాల్సిందే



ప్రస్తుతం సీజన్ కావడంతో ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రతిరోజూ వేర్వేరు ప్రాంతాల్లో తిరుగుతుంటా. అయినా ఖచ్చితంగా సన్నిధానంలో పూజా కార్యక్రమాలకు హాజరవుతుంటా. ఎక్కడ ఉన్నా సన్నిధానం వెళ్లకుంటే ఏదో వెలితిగా అనిపిస్తుంది. పదేళ్లుగా అయ్యప్పదీక్ష చేపడుతున్న. అందుకు ఖచ్చితంగా మా సన్నిధానం వాతావరణం కూడా కారణమే.

అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, 10వ పడి

ముగ్గురితో మొదలై నేడు 60 మందికి

పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు అయ్యప్పపేటగా విరాజిల్లుతోంది. 1999లో ఇదే గ్రామానికి చెందిన కుక్కల గోవర్ధన్ రెడ్డి, వేమ చెన్నారెడ్డి, పున్న యాదగిరి ముగ్గురు సాగర్‌కు చెందిన మీనన్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇక్కడ తొలిసారిగా అయ్యప్పదీక్ష చేపట్టారు. నాటి నుంచి ఏటా అయ్యప్ప మాలధారుల సంఖ్య క్రమంగా పెరుగుతుండగా ఎంత మంది పెరిగినా అందరూ ఒకే సన్నిధానంగా నిత్యపూజలు నిర్వహిస్తుండడం విశేషం. ఈ ఏడాది ఉమ్మడి మండలం(గుడిపల్లి, పీఏపల్లి) గ్రామాల నుంచి మొత్తం 60మంది ఈ సన్నిధానం వేదికగా అయ్యప్ప మండలదీక్ష చేపట్టారు. వీరిలో ఇప్పటికే 18వ పడి చేరుకున్న ఇద్దరు గురుస్వాములతో పాటు 10 మంది గురుస్వాములు ఉన్నారు. అదేవిధంగా ఈ సారి అత్యధికంగా 20 మంది కన్నె స్వాములు కూడా ఉండడం విశేషం. చిన్ని గురుస్వామి, మల్లయ్య గురుస్వామి సమక్షంలో మాలలు ధరించగా బైరు యాదగిరి గురుస్వాముల ఆధ్వర్యంలో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు.

నిష్ఠగా అయ్యప్ప మండల దీక్ష



నా కుమారుడు ఇప్పటికే పలుమార్లు స్వామిమాల ధరించాడు. నేను తొలిసారిగా అయ్యప్పదీక్ష తీసుకున్నా.సన్నిధానంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమం, భజన గురుస్వాములు అత్యద్భుతంగా నిర్వహిస్తున్నారు. గురుస్వాముల సూచనల మేరకు కన్నెస్వామిగా నిత్యం పూజలు చేస్తున్నా.

- గునిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కన్నెస్వామి.

'గుట్ట' పాలకమండలి దిశగా అడుగులు

● సీఎం ఆదేశాలతో అధ్యయనం ● 12 మంది సభ్యులతో పాలకమండలి నియామకానికి యోచన



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సుమారు 15 ఏళ్లుగా పాలకమండలి లేదు. ఆలయానికి పాలకమండలి నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 8వ తేదీన యాదగిరిగుట్టలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న సమీక్షా సమావేశంలో గుట్ట పాలకమండలి ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసిన విషయం విదితమే. దీంతో గుట్ట పాలకమండలి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. తిరుపతి తిరుమల దేవస్థానం(టీటీడీ) తరహాలో యాదగిరిగుట్ట పాలకమండలిని నియమించేందుకు అధ్యయనం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి అర్బన్)

యాదగిరిగుట్ట ఆలయ పాలకమండలిని 12మంది సభ్యులతో నియమించాలని ప్రభుత్వం యోచిస్తుండగా, ఇందులో దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ ఈవోను కూడా సభ్యులుగా ఎంపిక చేస్తారు. చైర్మన్, సభ్యుల నియామకానికి విధివిధాల రూపకల్పనకు ప్రభుత్వం అధ్యయనం మొదలుపెట్టింది. టీటీడీ పాలక మండలి నియామకానికి అమలు చేస్తున్న విధానాలు, యాదగిరిగుట్ట పాలకమండలి నియమించేందుకు ఎలాంటి నిబంధనలు ప్రవేశపెట్టాలనే అంశాలపై అధికారులు నివేదిక రూపొందించి ప్రభుత్వానికి ఇవ్వనున్నారు. దీనిపై త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. చైర్మన్‌తో కలిపి పాలక మండలి నేరుగా నియమించాలనేది ప్రభుత్వ నిర్ణయంగా తెలుస్తోంది. దీనికి ఫ్యామిలీ ఫౌండర్ ట్రస్ట్(ఎఫ్ఎఫ్‌టీ) చైర్మన్ వ్యవస్థ అడ్డుగా మారింది. రాష్ట్రంలోని దేవాలయాల్లో ఎఫ్ఎఫ్‌టీ విధానాన్ని మార్చాల్సి వస్తే పరిస్థితి ఏవిధంగా ఉంటుంది? చైర్మన్‌తో కలిపి నియమిస్తే ఎలా ఉంటుందనే అంశాలపై చర్చిస్తున్నట్లు సమాచారం. ఎఫ్ఎఫ్‌టీని తొలగిస్తే వారు కోర్టును ఆశ్రయించే అవకాశముందని ప్రభుత్వం యోచిస్తోంది.

● యాదగిరిగుట్ట ఆలయంతో పాటు జిల్లాలోని పలు ఆలయాలకు పాలక మండలి నియమించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం 14 మంది పాలకమండలి సభ్యులను నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినా అది కార్యరూపం దాల్చలేదు.

2009 వరకే పాలక మండలి

2009 సంవత్సరం వరకే పాలక మండలి నియామకం జరిగింది. అప్పుడు మూడేళ్ల కాలపరిమితిలో అనువంశిక ధర్మకర్తతో కలిపి 9మంది సభ్యులతో మండలి నియామకం జరిగేది. 2016 సంవత్సరం నుంచి వైటీడీఏ ఏర్పాటు చేసిన తర్వాత ఆలయం పునర్నిర్మించేందుకు పాలకమండలితో పని లేకుండా వైటీడీఏ ఆవిర్భవించింది. ఇందుకు గాను గత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినా పోటీ పెరగడంతో దానిని పక్కన పెట్టారు. సుమారు 15ఏళ్లుగా పాలక మండలి లేకుండానే ఆలయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం హైదరాబాద్‌తో పాటు అంతకంటే సమీపంలో ఓఆర్ఆర్ ఉండడంతో దేశ, విదేశాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం సెప్టెంబరులో పాలకమండలిని నియమించాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో తాత్కాలికంగా వాయిదా పడినట్లు సమాచారం. సీఎం ఆదేశించడంతో యాదగిరిగుట్ట ఆలయ పాలకమండలి నియామకానికి వేగం పుంజుకుంది.

బదిలీపై వెళ్లిన అధికారులు ఒక్కొక్కరుగా..

యాదగిరిగుట్ట ఆలయం నుంచి బదిలీపై వెళ్లిన అధికారులు ఒక్కొక్కరుగా తిరిగి ఇక్కడే విధుల్లో చేరుతున్నారు. సుమారు 12ఏళ్ల తర్వాత ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన అధికారుల కుటుంబ పరిస్థితుల కారణంగా ఒకరు, 2025 ఆగస్టులో ఉద్యోగ విరమణ పేరుతో ఒకరు, డిప్యూటేషన్‌పై మరొకరు ఇలా ఒక్కొక్కరుగా ఇక్కడ చేరడం స్థానికంగా చర్చాంశనీయమైంది. 2024 ఆగస్టు 5న రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జనరల్ బదిలీల్లో భాగంగా ఇక్కడి నుంచి ఏఈవో, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్, రికార్డు అసిస్టెంట్లు మొత్తం 26మందిని వేములవాడ, బాసర, భద్రాచలం, కొండగట్టు, కొమురవెల్లి ఆలయాలకు బదిలీ చేశారు. వేములవాడలో విధులు నిర్వహిస్తున్న అధికారులే ఇప్పుడు ఒక్కొక్కరుగా యాదగిరిగుట్ట ఆలయానికి వస్తున్నారు.

ముగ్గురు అధికారులు వెనక్కి

బదిలీలు జరిగిన 11రోజుల డిప్యూటేషన్‌పై తొలత సూపరింటెండెంట్ రాజన్‌బాబు యాదగిరిగుట్టకు తిరిగి వచ్చేసి విధుల్లో చేరారు. వేములవాడ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ గోలి శ్రీనివాస్ అక్కడి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు మేరకు పీఏగా వెళ్లారు. అక్కడి నుంచి డిప్యూటేషన్‌పై రాజన్‌బాబుకు అవకాశం దక్కింది. సెప్టెంబరు 23న సూపరింటెండెంట్ శ్రీలత, ఈ నెల 14న ఏఈవో గజ్వేల్లి రమేష్‌బాబు వేములవాడ నుంచి అధికారుల ఆదేశాల మేరకు యాదగిరిగుట్టలో విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ పరిస్థితుల కారణంగా శ్రీలత, ఉద్యోగ విరమణ పొందిన వేముల రామ్మోహన్ స్థానంలో 2025ఆగస్టులో ఉద్యోగ విరమణ పొందనుండటంతో తిరిగి అదేస్థానంలో ఏఈవోగా రమేష్‌బాబు ఇక్కడ విధుల్లో చేరారు. ఇది వరకు 14 మంది సూపరింటెండెంట్లల్లో ఎనిమిది మంది బదిలీపై వెళ్లగా వారి స్థానంలో ఆరుగురు ఇక్కడ చేరారు. ఇంకా ఇద్దరు పర్యవేక్షకులకు తిరిగి శ్రీలత చేరికతో ఒక సూపరింటెండెంట్ ఇక్కడ అవసరముంది. ఐదుగురు ఏఈవోలకు గాను వేములవాడ నుంచి బదిలీపై వచ్చిన హరిక్రిష్ణ దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. కాగా, ఏదో ఒక రకంగా ఒకరెనుకా..ఒకరు అందరు ఇక్కడికే చేరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేరికలు



దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేరికలు ఇప్పటి వరకు జరిగాయి. ఏఈవో హరిక్రిష్ణ దీర్ఘకాలిక సెలవులపై వెళ్లగా ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక్కడి నుంచి ఎనిమిది మంది సూపరింటెండెంట్లకు ఆరుగురు సూరింటెండెంట్లు మాత్రమే ఇక్కడ విధుల్లో చేరారు. అదనంగా వేములవాడ నుంచి సూపరింటెండెంట్ శ్రీలత చేరికతో ఏడుకు చేరింది. ఇంకో సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగానే ఉంది.

భాస్కర్‌రావు, యాదగిరిగుట్ట దేవస్థాన ఈవో.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	230
సూర్యాపేట	రూ.120	180	200
నల్లగొండ	రూ.132	194	214

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	584.60
టీఎంసీలు	295.4155
ఎడమకాల్వకు నీటి విడుదల	5367
కుడికాల్వకు	10,438
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	31,115
అవుట్‌ఫ్లో	31,315 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.54 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	330 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2వేల క్యూసెక్కులు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.42 అడుగులు
టీఎంసీలు	4.31
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	152.31 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	399.53 క్యూసెక్కులు

పరిమితికి మించి ప్రయాణికులు.. ఆటోలు సీజ్

చింతపల్లి, కొండమల్లేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్న డ్రైవర్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలకేంద్రంలో ఎస్ఐ యాదయ్య గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. కొండమల్లేపల్లి మండలం ఘాజీనగర్‌కు చెందిన బత్తుల యాదయ్య తన ఆటోలో 17మంది ప్రయాణికులతో వెళ్తున్నాడు. పోలీసులు ఆటోను తనిఖీ చేయగా అందులో 17మంది కూలీలు ఉన్నారు. ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల నుంచి చింతపల్లి వైపు ఆటోలో పరిమితికి మించి 20మంది పత్తి కూలీలను ఆటోలో ఎక్కించుకొని నిర్లక్ష్యంగా అజాగ్రత్తతో నడుపుతున్న ఆటోను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

భువనగిరి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో పాత గోశాల వద్ద ఒకరిపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 19న (మంగళవారం) పట్టణ బీసీ కాలనీకి చెందిన షేక్ ఇమ్రాన్(22) పాత గోశాల శ్రీలక్ష్మీ నరసింహ డార్మెంటరీ వద్ద పనిచేస్తున్న కసావు కుమార్‌ను డబ్బుల కోసం బెదిరించాడు. డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో ఇమ్రాన్ సదరు వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని సాగర్‌రోడ్డుపై ట్రాఫిక్ సమస్యను నియంత్రిస్తున్న క్రమంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ నడిరోడ్డుపై కారు నిలిపాడు. వాహనా రాకపోకలకు అంతరాయం ఏర్పడే విధంగా నిలిపిన కారును తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రయత్నించారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆర్. సుధీర్ పట్ల ఇర్ఫాన్ అసభ్యకరంగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినట్లు డీఎస్పీ తెలిపారు. కారుతోపాటు సదరు వ్యక్తిని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి పరీక్షించగా మద్యం మత్తులో ఉన్నట్లు తేలిందని, ఇర్ఫాన్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసుతోపాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన నేరం కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

తప్పతాగి డయల్ 100కు ఫోన్ చేసి..

కొండమల్లేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లికి చెందిన మారోజు కుమార్ తప్పతాగి పోలీసు విధులకు ఆటంకం కలిగించేలా 15 సార్లు డయల్ 100కు ఫోన్ చేశాడు. అక్కడికి వెళ్లిన పోలీసు కానిస్టేబుల్ మాజిద్, శేఖర్‌ను బూతులు తిడుతూ వారి విధులకు ఆటంకం కలిగించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు సదరు వ్యక్తిని తరలించినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మునగాల, నవంబరు 21: (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మండలంలోని నరసింహులగూడెం గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన క్వింటాల్ రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన శెట్టి వెంకటేశ్వర్లు క్వింటా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి వ్యాపారం చేస్తున్నాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పౌరసరఫరాల అధికారి(డీటీసీ) రమణారెడ్డి, పోలీసులు కలిసి దాడి చేసి పట్టుకున్నారు. వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని విచారించగా రేషన్ బియ్యం మోతె మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా పాఠశాల ఎస్‌వో దేవరం ధనలక్ష్మి వద్ద కొనుగోలు చేశానని తెలిపాడు. విక్రయించిన, కొనుగోలు చేసిన ఇద్దరిపై పై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అర్ధరాత్రి తిరుగుతున్న యువతకు కౌన్సిలింగ్

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ద్విచక్రవాహనాలతో రోడ్లపై తిరుగుతున్న యువకులకు పోలీసులు కౌన్సింగ్ నిర్వహించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన రహదారులపై డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా బుధవారం రాత్రి ఆపరేషన్ చబుత్ర కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని పలు ప్రధాన రహదారులపై అర్ధరాత్రి దాటాక 26 ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న 32మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. యువకుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి ప్రత్యేక కౌన్సింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప రాత్రివేళలో బయటకు రాకూడదని, ప్రజా స్వేచ్ఛకు ఆటంకం కలిగిచేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరేషన్ చబుత్ర కార్యక్రమంలో సీఐలు నాగర్జున, కరణాకర్, ఎస్ఐలు సుధీర్‌కుమార్, రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గేయ కావ్యం అభినందనీయం'

నకిరేకల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన స్థితిగతులపై సినీ గేయ రచయిత, వరంగల్ శ్రీనివాస్ 'నూరేళ్ల నా ఊరు పేట' కవితాత్మకంగా సుధీర్ఘ గేయకావ్యం రాయడం అభినందనీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మనుషుల్లో వచ్చిన మార్పు మానసిక పరిస్థితుల గురించి విపులంగా విశదీకరించి కవితాత్మకంగా సుధీర్ఘ గేయకావ్యం రాయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఏపూరి సోమన్న, కోదారి శ్రీనివాస్, అంబటి వెంకన్న, మద్యల సందీప్, గూడూరు మహేష్, రాయి వసంత పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శనశతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పిన అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 40,85,825ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా 552 జంటలు సత్యదేవుని వ్రతాలు పాల్గొన్నాయి. మహిళా భక్తులు కార్తీక దీపారాధన చేశారు. రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు, డీసీపీ రాజేష్‌చంద్ర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదాలను అందజేశారు.

ఆలయానికి చేరిన బంగారు రేకులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ గాలి గోపురం స్వర్ణతాపడానికి బంగారు తొడుగులు గురువారం ఆలయానికి చేరుకున్నాయి. దివ్య విమాన రాజగోపురానికి బంగారు తాడపం(తొడుగుల పనులు) బుధవారం మొదలుపెట్టారు. ఇందులో భాగంగా 2032 చదరపు అడుగుల స్వర్ణ రేకులు చేరుకోగా గురువారం మరో సుమారు రెండు వేల చదరపు అడుగుల బంగారు రేకులు చెన్నై నుంచి కంటైనర్‌లో యాదగిరిగుట్టకు చేరుకున్నాయి. స్వర్ణ తొడుగుల కోసం 10,500 చదరపు అడుగులకు ఇప్పటికే సుమారు 4032 చదరపు అడుగుల బంగారు తొడుగులు ఇక్కడకు చేరాయి.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

● విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం ● పెద్ద మంటలతో పూర్తిగా ఒరిగిన స్తంభం ● సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఘటన

హుజూర్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని ఓ వాహనం ఢీకొట్టిన ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గురువారం సాయంత్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురంలో మినీ ట్యాంక్‌బండ్ వద్ద రూ.2కోట్లతో చెరువుకట్టను నిర్మిస్తున్నారు. నిర్మాణానికి సంబంధించి కంకర, ఇసుక, డస్ట్ నీళ్ల ట్యాంక్ పక్కన నిల్వచేయగా, వారంరోజులుగా పనులు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం కంకర, ఇసుక, డస్ట్‌ను తీసుకెళుతున్న వాహనం (అజాక్స్ మిషన్) డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో స్తంభం పూర్తిగా ఒరిగిపోయి విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి మంటలు లేచి విద్యుత్ సరఫరా నిలిచింది. ఈ ఘటనతో ఆ సమయంలో అటువైపుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ప్రజలు ఉంటే పెను ప్రమాదం జరిగేదని పేర్కొన్నారు. 8, 9వ వార్డుల్లో ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 9గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



హుజూర్‌నగర్‌లో అజాక్స్ మిషన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఒరిగిన స్తంభం

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన బైక్.. యువకుడు మృతి

మర్రిగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పిపడడంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన గ్యార అంజయ్య కుమారుడు గ్యార నర్సింహ(27) అతనితో పాటు ఏర్పుల శివ మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లిలో తన బంధువుల ఇంటికి వెళ్తున్నామని ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. మాల్ నుంచి మర్రిగూడకు వస్తుండగా గురువారం తెల్లవారుజామున బైక్ అతివేగంగా వస్తూ తిరుగండ్లపల్లి శివారులోని ఇప్పుబండా గుట్ట మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో బైక్ వెనకాల కూర్చున్న గ్యార నర్సింహ చెట్లపొదల్లో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న ఏర్పుల శివకు తీవ్రగాయాలయ్యాయి. నర్సింహ స్వగ్రామం సుద్దపల్లిలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. నర్సింహ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



నర్సింహ మృతదేహం

రచ్చకెక్కిన డీఈవో భిక్షపతి కుటుంబ వివాదం

● ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన భార్య ● మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపణ ● విడాకుల విషయంలో కోర్టులో నడుస్తున్న కేసు

నల్లగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి కుటుంబ వివాదం రచ్చకెక్కింది. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో డీఈవో భిక్షపతి నివాసం ఉన్న ఇంటికి బంధువులతో కలిసి చేరుకున్న ఆయన భార్య మాధవి ఆందోళన చేపట్టింది. ఈ సమయంలో డీఈవో, ఆయన భార్య, బంధువుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన మాధవితో భిక్షపతికి 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే వివాహం జరిగిన నెల రోజులకే ఆయన తన భార్యకు దూరంగా ఉంటూ వచ్చినట్లు సమాచారం. భార్యను ఇంటి నుంచి పంపించడమే కాకుండా మరో మహిళతో సహజీవనం చేస్తున్నట్లు భార్యతో పాటు బంధువులు ఆరోపించారు. ఇదిలా ఉంటే వీరిద్దరి విడాకుల విషయం ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుంది. ఈ నెలలోనే తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కోర్టులో కేసు ఉన్నప్పుడు మరో మహిళతో ఎలా సహజీవనం చేస్తున్నాడని ఆయన భార్య ప్రశ్నించింది. అంతేకాక పెళ్లి అయిన నెల రోజులకే తనను ఇంటి నుంచి భిక్షపతి వెళ్లకొట్టాడని, ఆ తర్వాత మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపించింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య కొద్ది రోజులుగా వివాదం చోటుచేసుకోవడంతో పాటు అనేకసార్లు డీఈవోను ఆమె నిలదీసినట్లు తెలిసింది. తాజాగా గురువారం డీఈవో భిక్షపతి ఇంటికి బంధువులతో కలిసివచ్చి ఘర్షణ పడింది. తనతో వివాహమైన తర్వాత మరో మహిళతో ఎలా ఉంటావంటూ ఆయన్ను ప్రశ్నించడంతో పాటు వాగ్వివాదానికి దిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి వివాదం చోటుచేసుకోకుండా ఇరువురిని సముదాయించారు. ఆయన పెడుతున్న వరకట్నం వేధింపులు భరించలేక తాను దూరంగా ఉంటున్నానని, తనపై లేనిపోని ఆరోపణలు చేసి తనను ఇంటి నుంచి పంపించి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని భార్య మాధవి ఆరోపించింది. తన భర్త అన్యాయం చేశాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని భార్య మాధవి నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వివాదంపై డీఈవో భిక్షపతిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇది కుటుంబంలో చిన్న సమస్య అని, కోర్టులో కేసు ఉందని, ఈ నెలలో తీర్పు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.



డీఈవో భిక్షపతిని నిలదీస్తున్న భార్య మాధవి



క్యాంపస్ సమాచారం

ఎంజీయూ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

నల్లగొండ, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, పీజీ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫలితాలను వీసీ అల్తాఫ్ హుస్సేన్ గురువారం తన కార్యాలయంలో విడుదల చేశారు. పీజీ రెండో సెమిస్టర్‌లో 1143మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 62.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. పీజీ సెమిస్టర్ బ్యాక్‌లాగ్‌లో మొత్తం 261మంది విద్యార్థులు పరీక్ష రాస్తే 46.13శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సీవోఈ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, లక్ష్మీప్రభ, సంధ్యరాణి, బిక్షమయ్య, రమేష్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకూ ఈ చలాన్లు

● చింతపల్లి ఎస్ఐ యాదయ్య

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలు, వాహన అనుమతి తదితర అన్ని పత్రాలు కలిగి ఉండాలని చింతపల్లి ఎస్ఐ యాదయ్య సూచించారు. లేనిపక్షంలో ఈ చలాన్ ద్వారా జరిమానాలు, శిక్షలు తప్పవని హెచ్చరించారు. గతంలో పట్టణ ప్రాంతాలకు మాత్రమే ఈ చలాన్ విధించేవారని, ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ విధానం అమల్లోకి వచ్చిందని తెలిపారు.

● చింతపల్లి, (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ చలాన్ విధిస్తారా ?

ఎస్ఐ: గతంలో పట్టణ ప్రాంతాలకు మాత్రమే ఈ చలాన్ విధించేవారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ విధానం అమల్లోకి వచ్చింది. ముఖ్యంగా ఆటోలు, గూడ్స్ వాహహనాలు, ద్విచక్ర వాహనదారులు నిబంధనలకు లోబడి వ్యవహరించకుంటే ఎక్కడ పడితే అక్కడ ఈ చలాన్ విధిస్తారు. ఈ చలాన్‌లో ఎలాంటి మినహాయింపులు ఉండవు. బీమా సౌకర్యం కలిగి ఉండాలి. మద్యం తాగి వాహనాలు నడపొద్దు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. రోడ్డు నియమ నిబంధనలు విధిగా పాటించాలి. లేని పక్షంలో శిక్ష పడుతుంది.

ఆంధ్రజ్యోతి: పాయింట్ల వారీగా ఎలా నమోదు చేస్తారు ?

ఎస్ఐ : వాహనానికి, వాహనదారునికీ బీమా సౌకర్యం లేకపోవడం, ద్విచక్ర వాహనదారుడైతే హెల్మెట్ ధరించకపోవడం, ఇతర వాహనాలకు సీటు బెల్టు ధరించకపోవడం, పరిమితికి మించి తాగి బండి నడపటం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇచ్చినప్పుడు ఇలా ఒక్కో దానికి ఒక్కో విధంగా పాయింట్లు ఉంటాయి. ఇలా 12 పాయింట్లు దాటితే వాహనదారుడు ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొరికితే ఆ పోలీస్‌స్టేషన్ పోలీసులు వెంటనే ఆ వాహనాన్ని సీజ్ చేస్తారు. ఆ వాహనాన్ని కోర్టు అనుమతితో తగిన జరిమానా చెల్లించి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

విద్యార్థులు ప్రతిభను చాటాలి

భువనగిరి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను చాటాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవిలత అన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గ్రేస్ చిల్డన్ హోంలో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు గురువారం ఆమె బహుమతులను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటడం ద్వారా అవకాశాలు మెరుగవుతాయని, చదువుపై కూడా ప్రత్యేక శ్రద్ధను చూపాలని సూచించారు.

కోర్టులో ఉద్యోగావకాశాలు

జిల్లా న్యాయసేవా అధికార సంస్థలో ఒక స్టెనో, ఒక రికార్డ్ అసిస్టెంట్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి వి మాధవి లత గురువారం తెలిపారు. భర్తీకి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 7న ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన వారికి 8న స్కిల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు వెబ్ సైట్ https://yadadri.dcourts.gov.in/ ను సందర్శించాలని సూచించారు.

బెల్టుషాపుపై దాడి: మద్యం స్వాధీనం

చౌటుప్పల్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపుపై పోలీసులు దాడిచేసి, గురువారం మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెంలో అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్న గోరే శ్రీనివాస్ రెడ్డిపై కేసు నమోదు చేసి, 7బీర్లు, 11క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

శిథిల వంతెన..ఇరుకు దారి

● మోత్కూరు బిక్కేరు వంతెనపై జర పైలం..

ప్రభుత్వం ప్రధాన రహదారుల అభివృద్ధిపైనే దృష్టి సారిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేస్తే వాహన చోదకులకు దూరాభారం తగ్గి, ప్రధాన రహదారులపై రద్దీ తగ్గే అవకాశం ఉంటుంది. మోత్కూరులోని బిక్కేరు వంతన నుంచి వెళ్లేదారి నల్లగొండ నుంచి వరంగల్ వెళ్లడానికి దగ్గరి దారి. నార్కట్‌పల్లి నుంచి మోత్కూరు, గుండాల మీదుగా జనగామ, వరంగల్, నార్కట్‌పల్లి నుంచి మోత్కూరు, గుండాల మీదుగా దేవరుప్పుల, పాలకుర్తి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. దీనిని అభివృద్ధి చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



మోత్కూరు బిక్కేరు వంతెనపై ఎదురెదురుగా వెళ్లిన వాహనాలను పక్కకు తప్పించలేక ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

మోత్కూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మోత్కూరులోని బిక్కేరు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జి శిథిలావస్థలో ఉండటమే కాకుండా దారి ఇరుకుగా ఉండటంతో వాహన చోదకులు ఆ బ్రిడ్జిపై నుంచి వెళ్లేప్పుడు ముఖ్యంగా రాత్రివేళ వెళ్లేప్పుడు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనలకు గురవుతున్నారు. ఈ బిక్కేరు వాగుపై చెక్‌డ్యాం కమ్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నల్లగొండ- వరంగల్ జిల్లాలకు ఇది దగ్గరి దారి

మోత్కూరు బిక్కేరుకు ఒకవైపు మోత్కూరు, మరో వైపు గుండాల మండలాలు ఉంటాయి. ఈ బ్రిడ్జి రెండు మండలాలను కలుపుతుంది. నల్లగొండ నుంచి వరంగల్ వెళ్లడానికి ఇది దగ్గరి దారి. నార్కట్‌పల్లి నుంచి మోత్కూరు, గుండాల మీదుగా జనగామ, వరంగల్, నార్కట్‌పల్లి నుంచి మోత్కూరు, గుండాల మీదుగా దేవరుప్పుల, పాలకుర్తి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. ఈ బ్రిడ్జిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది.


గతంలో వాగులోపడిన బస్సు

సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన మోత్కూరు బ్రిడ్జి శిథిలమైంది. బ్రిడ్జి సింగిల్ వే బ్రిడ్జి కావడంతో ఇరుకుగా ఉంది. బ్రిడ్జిపై గుంతలు పడ్డాయి. బ్రిడ్జి రక్షణ పిల్లర్లు చిన్నగా ఉండటమే కాకుండా చాలా వరకు విరిగిపోయాయి. గతంలో ఓ సారి ఎదురుగా వస్తున్న వాహనాన్ని గమనించక ఎదురు వెళ్లిన ఆర్టీసీ బస్సు పక్కకు తప్పించే క్రమంలో బ్రిడ్జిపైనుంచి పల్టీకొట్టి బిక్కేరువాగులో పడింది. అప్పుడు బిక్కేరులో నీరు లేకపోవడం, వాగుపై నుంచి బ్రిడ్జి ఎత్తు తక్కువగా ఉండటం, బస్సులో ప్రయాణికులు ఎక్కువగా లేకపోవడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. నార్కట్‌పల్లి - జీడికల్ రోడ్డు డబుల్ రోడ్డు కాగా ఈ బ్రిడ్జి మాత్రం సింగిల్ వే బ్రిడ్జి. ఒక వాహనం వస్తే ఎదురుగా మరో వాహనం వెళ్లలేదు. అదమరిచి రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లితే నీవే వెనక్కు వెళ్లాలంటే నీవే వెనక్కు వెళ్లాలని రెండు వాహనాల డ్రైవర్లు తగాదా పడుతుంటారు. ఈ లోపు ఇరువైపుల వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయి ఇబ్బంది పడుతుంటారు. ముఖ్యంగా రాత్రి వేళ లైట్ల వెలుతురుకు ఎదురుగా వస్తున్న వాహనం బ్రిడ్జిపైకి వచ్చిందీ, రానిదీ తెలియక ఇబ్బంది పడుతున్నారు.

చెక్‌డ్యాం కమ్ బ్రిడ్జి నిర్మిస్తేనే..

మోత్కూరు బిక్కేరు వాగుపై ప్రస్తుత బ్రిడ్జి పక్కన డబుల్ రోడ్డు నూతన బ్రిడ్జి నిర్మించాలని మోత్కూరు-గుండాల ప్రజలతో పాటు ఈ రహదారి మీదుగా వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు. నూతన బ్రిడ్జిని చెక్‌డ్యాం కమ్ బ్రిడ్జిగా నిర్మిస్తే ఇటు రైతులకు ఉపయోగంగా ఉండటంతో పాటు అటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందంటున్నారు.

నూతన బ్రిడ్జి నిర్మాణానికి కృషి



మోత్కూరు బిక్కేరు వాగుపై నూతన బ్రిడ్జి నిర్మించేందుకు కృషి చేస్తున్నా. ఇప్పటికే రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. నార్కట్‌పల్లి నుంచి జీడికల్ వరకు డబుల్ రోడ్డు ఉండి మోత్కూరు బిక్కేరు బ్రిడ్జి మాత్రం ఇరుకుగా ఉంది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి కూడా శిథిలమైంది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తా.

-మందుల సామేలు, తుంగతుర్తి ఎమ్మెల్యే

సమాచారం

23న విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ సెల్

గుండాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 23వ తేదీన భువనగిరిలోని కిసాన్‌నగర్‌లోని విద్యుత్ డివిజన్ ఇంజనీర్ కార్యాలయం వద్ద నిర్వహించే విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ అంబాల నర్సింహులు కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి హాజరయ్యే వినియోగదారులు ఆధార్ కార్డు, విద్యుత్‌బిల్లు జిరాక్స్ పత్రాలను తీసుకు రావాలని తెలిపారు. ఈనెల 23న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

వలిగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చేగూరి నర్సింహ, అధ్యక్షుడిగా ఉలిపే మల్లేశం, ఉపాధ్యక్షుడిగా నారి వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా బుగ్గ చంద్రమౌళి, సహాయ కార్యదర్శిగా నల్ల రాములు, కోశాధికారిగా చెన్నబోయిన బిక్షపతి, కమిటీ సభ్యులుగా దయ్యాల సత్తయ్య, రేక రాములు, ఎనుగుల అయిలయ్య, రేగు శ్రీశైలం, నల్ల అయిలయ్య, మల్లేశం ఎన్నికయ్యారు.

ఉచిత వైద్యశిబిరం

బీబీనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగ్దుంపల్లి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం హిందుస్తాన్ శానిటరి వేర్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా, హిందుస్థాన్ కార్మిక సంఘం అధ్యక్షుడు గాలి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. సుమారు 200మందికి పైగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి రమేశ్ బాబు, కార్మిక సంఘం జనరల్ సెక్రటరి లింగం, వర్కింగ్ ప్రెసిడెంట్ బెజవాడ రమేశ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ జయంత్ అన్నారు. మండల పరిధిలోని కుంట్లగూడెంలో దివీస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ జయంత్ మాట్లాడుతూ దివీస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం



సదర్ సమ్మేళనంలో పాల్గొన్న బీర్ల అయిలయ్య

రాజాపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం రాత్రి రాజాపేట మండలం సింగారం గ్రామంలో సదర్ సమ్మేళాన్ని శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగారం రెడ్డి చెరువుకు త్వరల్లోనే గోదావరి జలాలను తరలిస్తామని తెలిపారు. సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లడ్డుయాదవ్, యాదవ సంఘం నాయకులు కుర్రాల రాములు తిరుమల్లేష్, సోములు, నరేష్, శంకర్, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వలిగొండ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ సిరిగి మల్లారెడ్డి కోరారు. ఈమేరకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా రామన్నపేట మార్కెట్‌యార్డు అభివృద్ధికి, మండల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని వారు మంత్రిని కోరారు.

రాచకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): సంస్థాన్ నారాయణపురం మండలంలోని రాచకొండ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతూ రాచప్ప సమితి సలహాదారుడు కడారు అంజిరెడ్డి గురువారం గాంధీభవన్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. రాచకొండ ప్రాంతానికి ఉన్న చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని విన్నవించారు.

సమస్యల పరిష్కారంలో టీఎస్‌యూటీఎఫ్ ముందంజ

ఆలేరు/ ఆలేరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేపట్టి టీఎస్ యూటీఎఫ్ ముందంజలో ఉందని తెలంగాణ స్టేట్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య అన్నారు. ఆలేరు పట్టణంలో జరిగిన యూటీఎఫ్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అధ్యక్షుడిగా ఎర్రగోళ్ల వెంకటేష్‌యాదవ్, ప్రధానకార్యదర్శి ఎండీ.సయ్యద్, సహాయ అధ్యక్షుడిగా భారతమ్మ, సిద్దేశ్వర సెక్రటరీగా దయాకర్, జిల్లా సహాయ కార్యదర్శిగా శంకరయ్య ఎన్నికయ్యారు. ఈ సంఘం ప్రతినిధులు బొమ్మగంటి బాల్‌రాజ్‌గౌడ్ యాదయ్య ఉన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు

భువనగిరి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉంటే బాధితుల ప్రాణాలను కాపాడవచ్చునని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ దిడ్డి బాలాజీ అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో గురువారం భువనగిరిలోని సిద్దార్థ ఐటీఐలో నిర్వహించిన సీపీఆర్ అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గుండెపోటుకు ప్రాథమిక చికిత్స సీపీఆర్‌యేనని అన్నారు. అందరూ సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మోటకొండూర్ వైద్య అధికారి డాక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ సీపీఆర్‌పై అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ వైశాకరెడ్డి, కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, రెడ్ క్రాస్ సొసైటీ డైరెక్టర్లు షేక్ హమీద్‌పాషా, చంద్రశేఖర్, సుజాయోద్దీన్ పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



బండసోమారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, భువనగిరి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. 64 మంది రూ.64,07,424 విలువైన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, 125 మందికి రూ.51,33,000 విలువైన సీఎం రిలీఫ్, మొత్తంగా 189మందికి రూ.1,15,924 విలువైన చెక్కులను గురువారం భువనగిరిలో ఆయన లబ్ధిదారులకు వచ్చిన తొలి ఏడాదిలోనే విప్లవాత్మక అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం సాధించిందని అన్నారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం, సంపూర్ణంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్ చిస్తి, ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం భువనగిరి మండలంలోని చీమలకొండూరు, ముస్యాలపల్లి, బండసోమారం గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి పరుస్తూ ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, మార్కెట్ చైర్మన్ రేఖ బాబురావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీలు తోటకూరి వెంకటేశ్ యాదవ్, నరాల నిర్మల, నాయకులు చిక్కుల వెంకటేశ్, పాశం శివానంద్, మంగ ప్రవీణ్, నానం కృష్ణ, షైలారం వెంకటేష్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చేసిన పనులకే శిలాఫలకాలు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు జనగాం పాండు, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య

భువనగిరి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు కొత్త శిలాఫలకాలు ఏర్పాటు చేసి తిరిగి శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం పాండు, మాజీ జడ్పీటీసీలు సుబ్బూరు బీరు మల్లయ్య, సందెల సుధాకర్, మాజీ ఎంపీపీలు కేశంపట్నం రమేశ్, అతికం లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పథకాలు ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు చేపట్టడం లేదని అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆ పనులను పూర్తి చేసిన అనంతరం ప్రారంభించినట్లయితే బాగుండేదన్నారు. ఫొటో ఫోజుల కోసం కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేసిన పనులనే తిరిగి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఏవీ.కిరణ్, అబ్బగాని వెంకట్, కంచి మల్లయ్య, కస్తూరి పాండు, కృష్ణ, సురేశ్ యాదవ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : భువనగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా నిలుస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని రేవణపల్లి గ్రామానికి చెందిన చింతల యువసేన నాయకుడు గోదాసు అనిల్ ఇటీవల అపెండిక్స్ చికిత్స జరుగడంతో ఆయన అనిల్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు చింతకింది కిరణ్, కుతాడి సురేష్‌కుమార్, విజయ్ కుమార్, వేముల సుమన్‌గౌడ్, సిద్దుల ప్రభాకర్, గుండు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారులు రాజకీయంగా ఎదగాలి



మోటకొండూరు: సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న మత్స్యకార్మికులు

ఆలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల్లో రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉన్న మత్స్యకారులు రాజకీయంగా రాణించాలని కాంగ్రెస్ పార్టీ మత్స్య శాఖ విభాగం మండల అధ్యక్షుడు బరిగే శ్రీనివాస్ ముదిరాజ్ కోరారు. గురువారం ఆలేరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ముందుగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎదుల రాజు ముదిరాజ్, గాజ బిక్షపతి ముదిరిజ్, చాగంటి ఎల్లయ్య ముదిరాజ్, గోవింద బిక్షపతి ముదిరాజ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలంలోని మోరిపిరాల గ్రామంలో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. బి.బాలమల్లయ్య,సిహెచ్ నారాయణ, బి.బాలయ్య, మారయ్య, వెంకటేష్, శంకరయ్య పాల్గొన్నారు.

మోటకొండూరు : మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు జోరుక ఎల్లేష్, మత్స్యపారిశ్రమ సహకార సంఘం ఉపాధ్యక్షుడు గుర్రాల కిష్టయ్య, గౌరవ అధ్యక్షుడు గుర్రాల రామకృష్ణ, గుర్రాల రవి, గుర్రాల పాండు, గంగరబోయిన రమేష్, రాజబోయిన రంజిత్, నీల పెద్దిరాజు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జినుకల బస్వయ్య కార్యదర్శి చింతల యాదగిరి, జినుకల బాషా, పొన్నమోని నర్సింహ, చింతల శంకర్, బాలకృష్ణ, కొసిని శంకర్ పాల్గొన్నారు.

గుండాల: మండలంలోని గుండాల, పెద్దపడిశాల, అనంతారం, బ్రాహ్మణపల్లి, సుద్దాల గ్రామాల్లో మత్స్యకార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మల్లెబంతుల వెంకన్న, కాచబోయిన సోమయ్య, పోతరబోయిన అంజయ్య, రాజు, మహేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి.. గుండాల: చౌటుప్పల్‌లో డిసెంబరు 15, 16, 17తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడే మద్దెపురం రాజు కోరారు. మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో గురువారం ఇంటింటికీ సీపీఎం కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఉచిత విద్య వైద్యం కల్పించాలి.. వలిగొండ: ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలని ధర్మ సమాజ్‌పార్టీ నాయకుడు బందెల రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, అణగారిన, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కేజీ టు పీజీ వరకు నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు సురేష్, వెంకటేశం, అరుణ్, వంశీ పాల్గొన్నారు.

గురు కులాల్లో అధికారులు విడతలవారీగా బస చేయాలి.. భువనగిరి రూరల్: జిల్లాలోని పలు గురుకుల వసతి గృహాల్లో విద్యార్థులు మౌలిక వసతులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారని సేవా సంస్థ జిల్లా అధ్యక్షురాలు ఐటిపాముల బాలమణి, కార్యదర్శి చెరువుపల్లి విశ్వనాథ్ పేర్కొన్నారు. గురువారం ఈమేరకు కలెక్టర్‌కు లేఖ రాశారు. గురుకులాల్లో అన్ని శాఖల అధికారులు విడతల వారీగా రాత్రి బస చేసే విధంగా కలెక్టర్ చొరవ చూపాలన్నారు.

అంబేడ్కర్ అభయ హస్తం పథకం అమలు చేయాలి.. మోత్కూరు : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అంబేడ్కర్ అభయ హస్తం పేరిట దళిత కుటుంబాలకు రూ.12లక్షలు ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మోత్కూరు అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

సంక్షిప్తంగా..

ధర్మ విఠల్‌రెడ్డి పోరాటం చిరస్మరణీయం.. ఆలేరు రూరల్: పేద ప్రజల కోసం నిరంతరం పోరాడి, అమరుడై ధర్మ విఠల్‌రెడ్డి పోరాటం చిరస్మరణీయమని సీపీఐ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శులు ఆర్ జనార్ధన్, మామిడాల బిక్షపతి అన్నారు. మండలంలోని కొలనుపాకలో విఠల్‌రెడ్డి 33వ వర్ధంతిని నిర్వహించారు. నాయకులు మామిడాల సోమయ్య, గడ్డం నాగరాజు, బేజారి కుమార్, రాజయ్య, అడివయ్య పాల్గొన్నారు.

బ్యాంకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి.. చౌటుప్పల్ రూరల్: పలు ప్రాంతాల్లో బ్యాంకుల్లో దోపిడీ జరుగుతున్నందున బ్యాంకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఐ మన్మథకుమార్ సూచించారు. గురువారం ఎస్ఐ లక్ష్మణ్‌తో కలిసి ఆయన పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకులను పరిశీలించారు. బ్యాంకు మేనేజర్, సెక్యురిటీ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ.. రాజాపేట: మండలంలోని రఘునాథ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని మండల విద్యాధికారి రమేష్ తనిఖీ చేశారు. డీఎస్సీ-2024 చెందిన ఉపాధ్యాయురాలు కీర్తి, సరిత అందజేసిన నోట్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యయుడు పెంటపర్తి మాదవరెడ్డి పాల్గొన్నారు.

● దూదివెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి గురువారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహాచారి, వెంకటేశ్వర్లు, రవీందర్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరం.. భూదాన్‌పోచంపల్లి: టీడీపీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈమేరకు పట్టణంలోని ముక్తాపూర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు.

నిత్యం సైబర్ ఉచ్చు

(5వ పేజీ తరువాయి): డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు, పాస్‌వర్డ్, ఫోన్‌కు వచ్చే ఓటీపీ అడుగుతున్నారు. వాటి ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉన్న నగదును ఆన్‌లైన్‌లో కాజేస్తున్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్ల విషయంలో కూడా మోసగిస్తున్నారు. ఇలాంటి ఘటనలు బ్యాంకు సెలవులకు ముందు అధికంగా జరుగుతున్నట్లు పోలీస్ అధికారులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేస్తే వివరాలు చెప్పొద్దని, వారు పంపించే అనవసరమైన లింకులను క్లిక్ చేయొద్దని పోలీసులు సూచిస్తున్నారు.

కేసులు నమోదు చేస్తామని బెదిరించి..

ఇటీవల కొంత మంది సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరలేపారు. ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాల వివరాలు అడిగి డబ్బులు కాజేసిన వారు కొత్త పంథాను ఎంచుకున్నారు. వివిధ దేశాలు, రాష్ట్రాల్లో చదివే విద్యార్థులు, ఉద్యోగం చేసే వారి తల్లిదండ్రులు, మిత్రులు, కుటుంబ సభ్యులకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తున్నారు. తాము ఫలానా ప్రదేశం నుంచి మాట్లాడుతున్నామని, మీకు సంబంధించిన వారు ఇక్కడ నేరం చేశారని, కేసు నమోదైతే ఇబ్బందులు కలుగుతాయని బెదిరిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు చేసే ఫోన్‌కు పోలీస్ యూనిఫాంతో కూడిన వాట్సప్ డీపీ ఫొటో పెడుతున్నారు. తాము మేము చెప్పిన నెంబరు, బ్యాంకు ఖాతాకు డబ్బు వెంటనే పంపిస్తే కేసు నమోదు కాకుండా కాపాడతామని నమ్మబులుకుతున్నారు. లేదంటే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారు. ఈ విషయాలను ఇతరులకు తెలపవద్దని సూచిస్తున్నారు. దీంతో చేసేది లేక వాట్సప్ డీపీ పోలీస్ యూనిఫాంతో ఉన్న వ్యక్తి ఫొటో చూసి అతడి మాటలను నమ్మి లక్షల్లో డబ్బు బదిలీ చేస్తూ మోసాలకు గురవుతున్నారు. ఇవే కాకుండా ఉన్నతాధికారులు, ఇతరుల ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం ఖాతాలను హ్యాక్ చేసి అత్యవసరం ఉందని, వెంటనే కొంత డబ్బు కావాలని మెసేజ్ పంపి మోసగిస్తున్నారు. ఇలా సూర్యాపేటలో గతంలో పని చేసిన కలెక్టర్ ఫేస్‌బుక్ ఖాతాను హ్యాక్ చేసి డబ్బు పంపాలని మెసేజ్ చేయడంతో నిజమని నమ్మి డీఎంహెచ్‌వో డబ్బు పంపించారు. ఆ తరువాత అనుమానం వచ్చి నిర్ధారణ చేసుకోవడంతో ఇది సైబర్ నేరగాళ్ల పని అని తేలింది.

ఎంతోమంది బాధితులు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిన బాధితులు ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది ఉన్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలానికి చెందిన ఓ వ్యక్తికి బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి మట్లాడుతున్నానని చెప్పి అతడి ఆధార్, ఏటీఎం కార్డు నెంబరు అడిగి ఓటీపీ ద్వారా సుమారు రూ.85వేలు కాజేశారు. అదే విధంగా చివ్వెంల మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు ఎస్‌బీఐ మేనేజర్‌ను మాట్లాడుతున్నాని, బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబర్‌ను లింకేజీ చేయాలని, అందుకు ఆధార్ నెంబర్‌ను చెప్పాలని అడిగి దాని ద్వారా రూ.60వేలు ఆన్‌లైన్ ద్వారా కాజేశాడు. చింతలపాలెం మండలానికి చెందిన ఓ వ్యక్తికి ఓ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన అధికారిని మాట్లాడుతున్నానని ఫోన్‌చేసి సుమారు రూ.4.50లక్షలు, ఒక ఐఫోన్ బహుమతి వచ్చిందని, అది కావాలంటే కొంత డబ్బును తన ఖాతాలో జమచేయాలని, ఫోన్‌ను కొరియర్ ద్వారా పంపించేందుకు ప్రాసెసింగ్ చార్జీ చెల్లించాల్సి ఉందని నమ్మపలికాడు. అది నమ్మిన బాధితుడు వారు చెప్పిన ఖాతాకు రూ.90వేలు నగదు బదిలీ చేశాడు. ఇలా ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది సైబర్ నేరగాళ్ల బారినపడి నగదును పోగొట్టుకున్న వారు ఉన్నారు. ఒక్క సూర్యాపేట జిల్లాలో గత ఏడాది 844 కేసులు నమోదు కాగా, సైబర్ మోసాల ద్వారా పోయిన డబ్బు రూ.5.12కోట్ల మేరకు ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 1,050 కేసులు నమోదు కాగా, బాధితులు పోగొట్టుకున్న డబ్బు రూ.5.90కోట్ల వరకు ఉంది.

కుక్కల దాడిలో దూడ మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన దూడ

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిచేయడంతో దూడ మృతిచెందింది. పట్టణంలోని వెంకటరమణ కాలనీకి చెందిన బాత్క పర్వతాలు పశువుల దొడ్డిలో గురువారం ఉదయం పశువుల దొడ్డిలో 10కుక్కలు మూడు నెలల దూడపై దాడి చేయడంతో దూడ మృత్యువాత పడింది.. ఉదయాన్నే పాలు పితికడానికి వచ్చిన పర్వతాలు కుక్కల శబ్దం వినిపించడంతో దొడ్డిలోకి వెళ్లగా కుక్కల గుంపు దూడపై దాడిచేస్తూనే ఉంది. వెళ్లగొట్టేందుకు ప్రయత్నించిన పర్వతాలుపై కుక్కలు దాడి చేశాయి. పెద్దగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి కుక్కలను తరిమి వేశారు.